
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
ఆదివారం 11 ఫిబ్రవరి 2024



సూపర్ సిక్స్ పథకాలతో చక్కని భవిష్యత్తు

టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర

- డుంబ్రిగుడ మండలంలో విస్తృత పర్యటన
- పలువురు గిరిజనులు పార్టీలో చేరిక



- వార్త 6వ పేజీలో..

గిరిజన ప్రత్యేక డీఎస్సీ కలేనా?

ఏజెన్సీ వ్యాప్తంగా 1,023 టీచర్ పోస్టులు ఖాళీ

- తాజా నోటిఫికేషన్‌లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు 329 పోస్టులు మాత్రమే
- దశాబ్ద కాలంగా స్పెషల్ డీఎస్సీ కోసం ఎదురుచూపులు
- వైసీపీ సర్కార్ తీరుపై గిరిజన నిరుద్యోగుల మండిపాటు



ప్రత్యేక డీఎస్సీ కోసం గతేడాది ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నాయకులు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

ఎన్నికలు సమీపిస్తుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా 6.100 టీచర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ తాజా పరిణామంతో గిరిజన ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చే పరిస్థితులు కనిపించడం లేదని గిరిజన నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి దశాబ్ద కాలంగా స్పెషల్ డీఎస్సీ నోటిషికేషన్ కోసం గిరిజన నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. గిరిజనుల కోసం స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలనే ఆలోచన గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం చేయకపోవడం గమనార్హం.

గిరిజన ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ కోసం 2013 నుంచి గిరిజన నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతరులకు టీచర్ పోస్టుల నియామకాలు చేపడుతున్నది. వీటిలో గిరిజనులకు కేవలం ఆరు శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పిస్తారు. కానీ గిరిజన ప్రాంతంలో బీఎడ్, డీఎడ్ అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా(గిరిజన) డీఎస్సీని నిర్వహించి, అందులో అన్ని(శత శాతం) పోస్టులను గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేస్తుంది. ఇందులో భాగంగా 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక డీఎస్సీ ద్వారా 640 పోస్టులు భర్తీ చేస్తామని జీవో:233ని జారీ చేసింది. కానీ అమలుకు నోచుకోలేదు. కాగా 2019 ఫిబ్రవరిలో 611 పోస్టుల భర్తీకి తెలుగుదేశం ప్రభుత్వం జీవో:10ను జారీ చేసింది. కానీ ఆ రెండు జీవోలు నేటికీ అమలుకు నోచుకోలేదు. వాటిపై గతంలో గిరిజన నిరుద్యోగులు, స్పెషల్ డీఎస్సీ సాధన సమితి, విద్యార్థి, గిరిజన సంఘాలు అనేక ఆందోళనలు చేపట్టాయి. గిరిజన ప్రాంతానికి ప్రత్యేక డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని గతంలోని కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు జీవోలు జారీ చేసినా ఆచరణకు నోచుకోకపోవడంపై గిరిజన నిరుద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించిన వైసీపీ ప్రభుత్వం సైతం తమకు న్యాయం చేయలేదని నిరుద్యోగులు అంటున్నారు. తమ కోసం ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయకపోగా, కనీసం ఏజెన్సీలోని ఖాళీల భర్తీని దృష్టిలో పెట్టుకుని ఎక్కువ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టినా తమకు మేలు జరిగేదని నిరుద్యోగులు అంటున్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా ప్రస్తుతం గిరిజన సంక్షేమ విద్యాశాఖ పరిధిలోని పాఠశాలల్లో 650, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 373.. మొత్తం 1,023 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కానీ తాజా డీఎస్సీ నోటిషికేషన్‌లో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో కేవలం 329 టీచర్ పోస్టుల భర్తీకి మాత్రమే అవకాశం కల్పించడం ఘోరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీలో ఖాళీగా వున్న టీచర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టి, తమకు న్యాయం చేయాలని మన్యం వాసులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి



గిరిజన ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఏజెన్సీ వ్యాప్తంగా వేలాది మంది నిరుద్యోగులు బీఎడ్, డీఎడ్ కోర్సులు పూర్తి చేసి స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ కోసం చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి ఆయా కోర్సులు, కోచింగ్ తీసుకున్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యంతో టీచర్ పోస్టులు భర్తీ కావడం లేదు. దీంతో గిరిజన నిరుద్యోగులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గిరిజన ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

- పి.అప్పలనర్స, గిరిజన సంఘం జాతీయ సభ్యుడు, పాడేరు

బాక్సైట్ మైనింగ్ కోసమే రహదారుల నిర్మాణం

- కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జీవో నంబరు-3 పునరుద్ధరణ
- 1/70 చట్టం పక్కాగా అమలు
- చింతపల్లి రచ్చబండ సభలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



చింతపల్లి రచ్చబండ సభలో మాట్లాడుతున్న షర్మిల

చింతపల్లి, ఫిబ్రవరి 10: బాక్సైట్ మైనింగ్ కోసమే సర్కార్ గిరిజన ప్రాంతంలో పెద్ద పెద్ద రోడ్లు నిర్మిస్తున్నదని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. శనివారం చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో డీసీసీ అధ్యక్షుడు వంతల సుబ్బారావు అధ్యక్షతన రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన షర్మిల మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో వెడల్పాటి ఎన్‌హెచ్ రహదారులు ఎందుకు నిర్మిస్తున్నారో తెలుసా?.. బాక్సైట్ మైనింగ్ కోసమేనని తెలిపారు. ఆదివాసీలకు శత శాతం ఉద్యోగాలు కల్పించాలని జీవో నంబరు-3 ప్రవేశపెట్టారని, ఈ జీవోను సుప్రీం కోర్టు రద్దు చేస్తే పునరుద్ధరించే ప్రయత్నం వైసీపీ ప్రభుత్వం చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జీవో నంబరు-3 పునరుద్ధరిస్తామన్నారు. అవసరమైతే సుప్రీం కోర్టుకు వెళతామన్నారు. అలాగే గిరిజన ప్రాంతంలో 1/70 చట్టాన్ని పక్కాగా అమలు చేస్తామని, గిరిజనుల భూములకు పూర్తి స్థాయి రక్షణ కల్పిస్తామన్నారు. గిరిజనుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన హక్కులు, చట్టాలు దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రవేశపెట్టినవేన్నారు. రాజశేఖర్ రెడ్డి హయాంలో 20 లక్షల ఎకరాలకు అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలు అందజేసినట్టు రఘువీరారెడ్డి చెప్పడం చాలా సంతోషంగా ఉన్నదన్నారు. నాడు గిరిజనుల కోసం రాజశేఖర్‌రెడ్డి రూ.300 కోట్లు ఖర్చు చేశారన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏలకు భారీ మొత్తంలో నిధులు మంజూరు చేశారన్నారు. ప్రస్తుతం ఐటీడీఏల్లో నిధుల కొరత అధికంగా ఉన్నదన్నారు. చింతపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, ఏకలవ్య పాఠశాలలు, ఆర్‌ఐటీఐలు కాంగ్రెస్ హయాంలో ఏర్పాటు చేసినవేనన్నారు. ప్రస్తుతం ఏ గ్రామానికి వెళ్లినా నాడు కాంగ్రెస్ హయాంలో నిర్మించిన రోడ్లు, రక్షిత మంచినీటి పథకాలు ఉన్నాయని గిరిజనులు చెబుతున్నారన్నారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ గతంలో గిరిజన ప్రాంతంలో విషజ్వరాలతో ఆదివాసీలు మరణించేవారన్నారు. ఆదివాసీలకు సరైన పోషకాహారం ఉండేదికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో విషజ్వరాలను అరికట్టేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని చెప్పారు. గిరిజనులకు రేషన్‌తో పాటు ప్రత్యేక

... మిగతా 6వ పేజీలో

పాడేరు కాంగ్రెస్ అభ్యర్థిగా వంతల సుబ్బారావు



పాడేరు నియోజకవర్గం అభ్యర్థిగా ప్రకటించిన వంతల సుబ్బారావు

చింతపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డీసీసీ అధ్యక్షుడు వంతల సుబ్బారావు పోటీ చేస్తారని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రకటించారు. శనివారం చింతపల్లిలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో మాజీ పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, రఘువీరారెడ్డిల సిఫారసు మేరకు ఆమె తొలి పార్టీ అభ్యర్థిని పాడేరు నియోజకవర్గానికి ప్రకటిస్తున్నానని ఆమె చెప్పారు. గిరిజనులు పాడేరు నియోజక వర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తారనే నమ్మకం ఉందని షర్మిల అన్నారు.



విశాఖ విమానాశ్రయంలో అభివాదం చేస్తున్న నారా లోకేశ్

లోకేశ్‌కు ఘన స్వాగతం

రోడ్డు మార్గాన ఇచ్ఛాపురానికి...

- నేడు 'శంఖారావం' ప్రారంభం
- 17 నుంచి విశాఖ జిల్లాలో పర్యటన

విశాఖపట్నం, ఫిబ్రవరి 10: ఉత్తరాంధ్రలో 'శంఖారావం' కార్యక్రమం ప్రారంభించేందుకు శనివారం విశాఖకు విచ్చేసిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు విమానాశ్రయంలో నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో సాయంత్రం ఆరున్నర గంటలకు విశాఖపట్నం చేరుకున్నారు. లోకేశ్‌కు ఎయిర్‌పోర్టులో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రులు బండారు సత్యనారాయణ మూర్తి, కిడారి శ్రావణ్, మాజీ ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, గండి బాబ్జీ, వంగలపూడి అనిత, నేతలు కోరాడ రాజబాబు, మహ్మద్ నజీర్, పాశర్ల ప్రసాద్, రెడ్డి నారాయణరావు, పుచ్చా విజయకుమార్, పీఎస్ నాయుడు తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈనెల 17వ తేదీ నుంచి విశాఖ జిల్లాలో చేపట్టనున్న శంఖారావం యాత్రపై నాయకులతో లోకేశ్ ముచ్చటించారు. అనంతరం రోడ్డు మార్గంలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం బయలుదేరి వెళ్లారు. ఆదివారం 'శంఖారావం' ప్రారంభించనున్నారు.

విశాఖ జిల్లాలో 17 నుంచి పర్యటన

శంఖారావం యాత్రలో భాగంగా నారా లోకేశ్ ఈనెల 17వ తేదీ నుంచి విశాఖ జిల్లాలో పర్యటించనున్నారు. 17వ తేదీ సాయంత్రం భీమిలి నియోజకవర్గంలో సభ, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారు. 18వ తేదీ ఉదయం విశాఖ తూర్పు, మధ్యాహ్నం దక్షిణ, రాత్రికి ఉత్తర నియోజక వర్గాల్లో పర్యటిస్తారు. కార్యకర్తలతో సమావేశాలు, బహిరంగ సభలు ఉంటాయని పార్టీ వర్గాలు తెలిపాయి. 19వ తేదీన విశాఖ పశ్చిమ, గాజువాక నియోజకవర్గాల్లో పర్యటించిన అనంతరం అనకాపల్లి జిల్లాకు వెళతారు.

వైసీపీకి ఎదురుగాలి

- ట్రైకార్ మాజీ చైర్మన్ బుల్లిబాబు కాంగ్రెస్‌లో చేరిక
- 70 మంది నాయకులు కూడా..



ట్రైకార్ మాజీ చైర్మన్ బుల్లిబాబుకి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న షర్మిల

చింతపల్లి, ఫిబ్రవరి 10: పాడేరు నియోజకవర్గంలో వైసీపీకి ఎదురుగాలి వీస్తున్నది. తాజాగా వైసీపీకి రాజీనామా చేసిన ట్రైకార్ మాజీ చైర్మన్ సతకా బుల్లిబాబుతో పాటు 70 మంది వైసీపీ నాయకులు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం చింతపల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమానికి సతకా బుల్లిబాబు తన మద్దతుదారులతో చింతపల్లి చేరుకున్నారు. పీసీసీ మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, రఘువీరారెడ్డిలు షర్మిల వద్దకు తీసుకొచ్చి ట్రైకార్ మాజీ చైర్మన్‌కి ఆమెతో కండువా వేయించారు. ఆయనతోపాటు ఐదు మండలాలకు చెందిన 11 మంది సర్పంచులు(వైసీపీ మద్దతు), ఐదుగురు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు, ముగ్గురు మాజీ ఎంపీటీసీ సభ్యులు, ఒక వైస్ ఎంపీపీతో పాటు మరో మాజీ ఎంపీపీ, 49 మంది వైసీపీ వివిధ స్థాయిల నాయకులు, వార్డు సభ్యులు కాంగ్రెస్‌లో చేరారు. ఒకేసారి భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, పార్టీ సర్పంచులో వైసీపీని వీడడంతో పార్టీ అధిష్ఠానం అంతర్మథనంలో పడింది. కాగా కాంగ్రెస్‌లో చేరిన ట్రైకార్ మాజీ చైర్మన్ బుల్లిబాబు విలేకరులతో మాట్లాడుతూ వైసీపీలో తనకు సముచిత స్థానం కల్పించలేదన్నారు. ట్రైకార్ చైర్మన్ హోదాలోనూ ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని చెప్పారు. తన క్యాడర్‌కి సైతం సరైన గుర్తింపు లేదన్నారు. ఈ కారణంగా పార్టీ మారాల్సి వచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు కృషి చేస్తామని చెప్పారు.

తగ్గని పొగమంచు

జి.మాడుగులలో 13.4 డిగ్రీలు



చింతపల్లిలో మంచు

పాడేరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నప్పటికీ పొగమంచు ప్రభావం ఏ మాత్రం తగ్గడం లేదు. జి.మాడుగులలో 13.4, అరకులోయ, పాడేరులో 15.5, ముంచంగిపుట్టు, పెదబయలులో 15.6, డుంబ్రిగుడలో 16.4 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు శనివారం నమోదయ్యాయి. ఏజెన్సీలో తెల్లవారుజాము నుంచి ఉదయం తొమ్మిది గంటల వరకు పొగమంచు దట్టంగానే కమ్ముకుంది. దీంతో హెడ్ లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అలాగే మధ్యాహ్నం వేళల్లో ఎండ తీవ్రత ఒక మోస్తరుగా పెరిగింది. మరో వారం తరువాత వాతావరణం పూర్తిగా మారిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జీకేవీధి, చింతపల్లిలో..

చింతపల్లి: గిరిజన గ్రామాల్లో మంచు ఉధృతి తగ్గడం లేదు. రెండు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగినప్పటికి ఉదయం వేళల్లో మంచు దట్టంగా కురుస్తున్నది. శనివారం జీకేవీధిలో 15.8, చింతపల్లిలో 15.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రత గతంతో పోల్చుకుంటే కొంత తగ్గింది. అయితే అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు ఉదయం పది గంటల వరకు చింతపల్లి, లంబసింగి, తాజంగి, ఆర్‌వీనగర్, జీకేవీధి ప్రాంతాల్లో మంచు కురుస్తున్నది.



పాడేరు- జి.మాడుగుల మార్గంలో శనివారం ఉదయం పొగమంచు



బలిమెల జలాశయం నీటి వినియోగంపై సమావేశమైన ఇరు రాష్ట్రాల అధికారులు

బలిమెల నీటి వినియోగంపై భేటీ

ఆంధ్రా, ఒడిశా అధికారుల సమీక్ష

- ప్రస్తుతం బలిమెల, జోలాపుట్‌ల్లో నీటి నిల్వలు 47.7828 టీఎంసీలు
- ఏపీ వాటా 20.8368, ఒడిశా వాటా 26.9510 టీఎంసీలు

సీలేరు, ఫిబ్రవరి 10: ఆంధ్రా, ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయానికి సంబంధించి ఏ రాష్ట్రం ఎంత నీటిని వినియోగించుకుంటున్నదో లెక్కించేందుకు శనివారం ఇరు రాష్ట్రాల అధికారులు ఒడిశా మల్కన్‌గిరి జిల్లా బలిమెల ఓహెచ్‌పీసీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2023- 2024 నీటి సంవత్సరంలో 2023 జూలై నుంచి 2024 జనవరి 31 నాటికి బలిమెల జలాశయం నుంచి ఆంధ్రా తన వాటాగా 45.7824 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్టు, ఒడిశా తన వాటాగా 39.6683 టీఎంసీల నీటిని వినియోగించుకున్నట్టు ఇరు రాష్ట్రాల అధికారులు లెక్కలు తేల్చారు. దీని ప్రకారం ఆంధ్రా.. ఒడిశా కంటే ఇప్పటి వరకు 6.1141 టీఎంసీల నీటిని అధికంగా వినియోగించుకున్నట్టు అధికారులు నిర్ధారించారు. ప్రస్తుతం బలిమెల జోలాపుట్ జలాశయాల్లో కలిపి 47.7828 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్టు లెక్కలు కట్టారు. ఈ నీటి నిల్వల్లో ఆంధ్రాకు 20.8368 టీఎంసీలు, ఒడిశాకు 26.9510 టీఎంసీలుగా పంపకాలు జరిపారు. ప్రస్తుతం ఇరు రాష్ట్రాల విద్యుత్, ఇరిగేషన్ అవసరాల నిమిత్తంగా ఆంధ్రాకు 1000 క్యూసెక్కుల నీటిని, ఒడిశాకు 2300 క్యూసెక్కుల నీటిని బలిమెల జలాశయం నుంచి విడుదల చేయడానికి ఇరు రాష్ట్రాల మధ్య ఏకగ్రీవంగా ఒప్పందం కుదిరింది. ఈ సమావేశంలో ఒడిశా తరఫున బలిమెల హైడ్రో ప్రాజెక్టు జనరల్ మేనేజర్లు శివప్రసాద్‌రావు(ఎలక్ట్రికల్), కృపాసింధూ బిస్వాల్ (టెక్నికల్ వింగ్), మేనేజర్ ఓఎం ప్రకాష్‌నాయక్, డిప్యూటీ మేనేజర్ జ్యోతిర్మయదాస్, అసిస్టెంట్ మేనేజర్ రాజేష్ పాణిగ్రహి, పొట్రేరు ఇరిగేషన్ చీఫ్ కనస్ట్రక్షన్ ఇంజనీర్ పితబాస్‌శెట్టి, చిత్రకొండ ఎర్త్ డ్యాం డివిజన్ ఎస్‌ఈ రమాకాంత పాత్రో, ఏఈఈ తుషార్‌రంజన్ కుంతే, ఏఈలు గడాధర్ ప్రధాన్, కేసీ ఫణి పాల్గొనగా, ఆంధ్రా తరఫున ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్సు సూపరింటెండెంట్ ఇంజనీర్ కేకేవీ ప్రశాంత్‌కుమార్, డ్యాం అండ్ పవర్ హౌస్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.వెంకట మధు, ఏఈఈ కె.పావని పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

- జిల్లాలో 33 కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 4,316 మంది విద్యార్థులు
- సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- సెలవు రోజు ప్రారంభంపై విద్యార్థుల అసహనం

పాడేరు, ఫిబ్రవరి 10: జిల్లాలో ఆదివారం నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు 33 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు చెందిన 4,316 విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. .

సీసీ కెమెరాల పర్యవేక్షణలో...

పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో పరీక్షలు నిర్వహించనున్న 33 కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి అప్పలరాము తెలిపారు. కాగా ఆదివారం సెలవు రోజున పరీక్షలు ప్రారంభిస్తుండడంపై విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

క్రైం... crime news

సరుగుడు యంత్రంలో చిక్కుకుని మహిళా కూలీ మృతి


ప్రమాదంలో మృతి చెందిన వెన్నెల సూర్యనారాయణమ్మ

పరవాడ, ఫిబ్రవరి 10: సరుగుడు కలప నుంచి తొక్కను వేరు చేసే యంత్రంలో చిక్కుకుని మహిళా కూలీ అక్కడికక్కడే మృతి చెందింది. స్థానిక సినిమాహాల్ జంక్షన్ సమీపంలోని సరుగుడు కర్రల యార్డులో శనివారం మధ్యాహ్నం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక పరవాడ సినిమాహాల్ జంక్షన్ సమీపంలో గల కర్రల యార్డులో సరుగుడు కలప నుంచి తొక్కను యంత్రం ద్వారా వేరు చేస్తారు. ఈ యంత్రం వద్ద కొన్ని రోజులుగా కట్టవానిపాలెం, చిట్టిబోయినపాలెం, వెన్నెలపాలెం గ్రామాలకు చెందిన కూలీలు పనిచేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం భోజనం అనంతరం వెన్నెలపాలెం గ్రామానికి చెందిన వెన్నెల సూర్యనారాయణమ్మ (55) యంత్రంలో సరుగుడు కర్రలు వేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ చీర కొంగు యంత్రంలో చిక్కుకుంది. ఆ సమయంలో యంత్రాన్ని ఆపు చేసే అవకాశం లేకపోవడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఆమెతోపాటు మరో నలుగురు మహిళలు పనిచేస్తున్నారు. విషయం తెలుసుకున్న పరవాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. కాగా సూర్యనారాయణమ్మకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


శ్రీను (ఫైల్)

నక్కపల్లి, ఫిబ్రవరి 10: మండలంలో మనబాలవానిపాలెం హైవే జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మృతి చెందినట్టు సీఐ విజయ్‌కుమార్ చెప్పారు. ఈ గ్రామానికి ఎం.శ్రీను (42) రోడ్డుపై నడిచి వెళుతుండగా నక్కపల్లి వైపు వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తుచేస్తున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

ఎలమంచిలి, ఫిబ్రవరి 10: మండలంలోని పులపర్తి జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున ఆర్టీసీ బస్సును వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. విశాఖపట్నం నుంచి భీమవరం వెళుతున్న బస్సును వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో బస్సు ముందున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదన్నారు.

అలల ఉధృతికి దెబ్బతిన్న ఎనిమిది బోట్లు

నక్కపల్లి, ఫిబ్రవరి 10: మండలంలోని డీఎల్‌పురం సముద్రతీరంలో అలల ఉధృతికి మత్స్యకారుల బోట్లు, వలలు దెబ్బతిన్నాయి. శనివారం తెల్లవారుజామున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లగా ఒక్కసారిగా అలలు ఉధృతంగా రావడంతో 8బోట్లు దెబ్బతిన్నాయని మత్స్యకారులు చెప్పారు. వాసుపల్లి నాగరాజు, గరికిన బాబ్జి, దోనీ సత్తిబాబు, వాసుపల్లి పెదవెంకులు, యజ్జల అన్నవరం, మసేను, దోని అప్పారావులకు చెందిన బోట్లు వలలు దెబ్బతిన్నాయి. సుమారు రూ.2.5లక్షలు ఆస్తి నష్టం జరిగినట్టు మత్స్యకారులు తెలిపారు.

సెల్‌ఫోన్ల దొంగలకు రిమాండ్

కశింకోట, ఫిబ్రవరి 10: సెల్‌ఫోను దొంగిలించిన కేసులో ముగ్గురికి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ వినోద్‌బాబు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి విశాఖపట్నం పాత పోస్టాఫీసు ప్రాంతానికి చెందిన నక్కబోయిన శివశంకర్, నక్కబోయిన రాజేష్, చేపల ఉదయ్‌శంకర్ నర్సీపట్నం బొడ్డుపల్లికి వెళ్లారు. తిరిగి వస్తుండగా మార్గమధ్యలో ఉన్న కన్నూరుపాలెంలో ఆగి వర్రి చిన అప్పలనాయుడు ఇం ట్లోకి చొరబడి రెండు సెల్‌ఫోనులు దొంగతనం చేశారన్నారు. ఇంట్లో చప్పుడు కావడంతో లేచి చూసేసరికి రెండు సెల్‌ఫోనులు పట్టుకొని పారిపోతున్నారని, వెంటనే కేకలు వేయడంతో అక్కడి నుంచి ఆటోలో తాళ్లపాలెం వైపు పరారయ్యారని తెలిపారు. వెంటనే 100 నంబరుకు కాల్ చేయగా తాళ్లపాలెం జంక్షన్ వద్ద నిందితులు ప్రయాణిస్తున్న ఆటోను ఆపి అదుపులోకి తీసుకొని అరెస్టు చేశామని చెప్పారు. కోర్టు ముందు హాజరుపరచగా వీరికి రిమాండ్ విధించినట్టు తెలిపారు.

గాజువాక వైసీపీ సమన్వయకర్తకు నలుగురు సెక్యూరిటీ

- ఇష్టానుసారంగా అధికార దుర్వినియోగం
- మేయర్‌కు లేని సెక్యూరిటీ...కార్పొరేటర్‌కి ఎందుకో..?


సెక్యూరిటీ నడుమ గాజువాక వైసీపీ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో వింత పోకడలు ఎక్కువయ్యాయి. అధికార దుర్వినియోగం అధికమైంది. మహా విశాఖ నగర పాలక సంస్థ(జీవీఎంసీ) మేయర్ గొలగాని హరికుమారికి ఎటువంటి భద్రత ఏర్పాట్లు లేవు. కానీ ఓ వార్డు (70)కు కార్పొరేటర్‌గా ఉన్న ఉరుకూటి రామచంద్రరావు(చందూ)కు ప్రభుత్వం తాజాగా నలుగురు (2+2) గన్‌మెన్‌ను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆదేశాలు రాగానే అవి అమలులోకి కూడా వచ్చేశాయి. చందూకు బెదిరింపులు లేవు. శత్రువులు లేరు. రక్షణ కావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరలేదు. కానీ ఇచ్చారు. ఆయన గాజువాక నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త కావడమే దానికి ప్రధాన కారణం. వచ్చే ఎన్నికల్లో గాజువాక నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన బరిలో దిగుతారని, అందుకే రక్షణ కల్పించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఇక్కడ విచిత్రం ఏమిటంటే...ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేగా ఉన్న తిప్పల నాగిరెడ్డికి 1+1 సెక్యూరిటీ మాత్రమే ఉంది. గతంలో మంత్రిగా చేసి ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు కూడా 1+1 సెక్యూరిటీయే ఉంది. వీరందరికీ ఇద్దరిని మాత్రమే ఇచ్చి చందూకి నలుగురిని ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదని అధికార పార్టీ నాయకులే అంటున్నారు.

అభ్యర్థిత్వం ఖరారైనట్టేనా...

గాజువాక వైసీపీ సమన్వయకర్తగా నియమితులైన చందూయే ఎమ్మెల్యే అభ్యర్థి అని ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి ప్రకటించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కుటుంబానికి ఈసారి టికెట్ ఇవ్వలేమని అధిష్ఠానం స్పష్టంచేసినా వారు ఇంకా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. యాదవ సామాజిక వర్గమని చందూకి టికెట్ ఇచ్చినట్టయితే...ఆయన కంటే మేయర్ హరికుమారిని పోటీకి దింపాలని తిప్పల వర్గం ప్రతిపాదించింది. ఇటువంటి తరుణంలో ప్రభుత్వం తాజాగా చందూకు సెక్యూరిటీని ఇవ్వడంతో ఆయనకే టికెట్ అనే విషయం పరోక్షంగా స్పష్టంచేసినట్టయింది.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	117.00
లైవ్ ధర	137.00
విత్ స్కిన్	244.00
స్కిన్ లెస్	254.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

బస్సుల కొరత... విద్యార్థుల కలత

- నర్సీపట్నంలోని విద్యాలయాలకు నిత్యం వందలాది మంది రాకపోకలు
- ఉదయం వేళ రెండే బస్సులు ఉండడంతో కిక్కిరిసి ప్రయాణం
- ఇంటి నుంచి వెళ్లింది మొదలు.. తిరిగి చేరేవరకు తల్లిదండ్రులు ఆందోళన
- వాహనాల సంఖ్య పెంచాలని అంతా వేడుకోలు



జోగంపేటలో ఆర్టీసీ బస్సులో ఫుట్‌బోర్డుపై వేలాడుతూ వెళుతున్న విద్యార్థులు

గొలుగొండ, ఫిబ్రవరి 10: బస్సుల కొరత విద్యార్థులకు తీరని సమస్యగా మారింది. ఈ ప్రాంతం నుంచి నర్సీపట్నంలో గల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు రోజూ వందలాది మంది విద్యార్థులు వెళ్లివస్తుంటారు. ఉదయం సమయంలో తరగతులకు వెళ్లేందుకు రెండు ఆర్టీసీ బస్సు సర్వీసులు మాత్రమే ఉన్నాయని, అవి ఎటుకూ చాలడం లేదని వారంతా వాపోతున్నారు. గత్యంతరం లేక ఆ బస్సులు ఫుట్‌బోర్డులపై సైతం వేలాడి మరీ విద్యాలయాలకు వెళ్లివస్తున్నారు. ఇది చూసిన తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. పిల్లలు ఇంటి నుంచి బయల్దేరింది మొదలు.. సాయంత్రం ఇంటికి చేరే వరకు ఎప్పుడు ఎలా ఉంటుందోననే ఆందోళన వారిని వేధిస్తోంది. బస్సుల సంఖ్య పెంచాలని పలుమార్లు అధికారులను కోరినప్పటికీ ఫలితం లేకపోతోందని అంటున్నారు. ఇదిలావుంటే, ప్రైవేటు వాహనాలు సైతం ఇదే రద్దీతో రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో విద్యార్థులు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. బస్సుల కొరత కారణంగా సకాలంలో కళాశాలలకు చేరలేకపోతున్నామని, దీని వల్ల విలువైన సమయం వృథా అవుతూ చదువులో వెనుకబడిపోతున్నామని కొందరు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ రూటులో బస్సుల సంఖ్య పెంచాల్సిందిగా విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

12న రోడ్డు పునర్నిర్మాణానికి అచ్యుతాపురంలో మానవహారం


అచ్యుతాపురంలో ప్రచారం చేస్తున్న రామ సదాశివరావు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 10: అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డుని పునర్నిర్మించాలని కోరుతూ ఈనెల 12న భారీ మానవహారంతో నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశామని రోడ్డు పునర్నిర్మాణ పోరాట కమిటీ కన్వీనర్ కాండ్రేగుల రామ సదాశివరావు తెలిపారు. శనివారం వీరు అచ్యుతాపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రోడ్డు ప్రాణాంతకంగా మారిందని, ప్రతిరోజు ఏదో ఒక చోట ప్రమాదాలు జరిగి వాహన చోదకులు క్షతగాత్రులుగా మారుతున్నారన్నారు. ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు కాని, ప్రజాప్రతినిధులు కాని పట్టించుకోవడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో కర్రి అప్పారావు, ఎస్.కన్నుంనాయుడు, బుద్ద రంగారావు, కె.వెంకట రమేష్, కె.సోమునాయుడు, డి.శ్రీను, పి.నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పీఈటీకి పతకం


స్వర్ణ పతకం సాధించిన ప్రతాప్

చోడవరం, ఫిబ్రవరి 9 : హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో చోడవరం పట్టణానికి చెందిన క్రీడాకారుడు ఆండ్ర ప్రతాప్ బంగారు పతకాన్ని సాధించారు. శుక్రవారం జరిగిన 50 ఏళ్ల వయస్సు కేటగిరీలోని వంద మీటర్ల హర్డిల్స్‌లో ప్రతాప్ 19.22 సెకన్లలో గమ్యం చేరి ప్రథమ స్థానంలో నిలిచి ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారు. పీఈటీ అయిన ప్రతాప్ వెటరన్ క్రీడల్లో సత్తాచాటడం విశేషం.

నేడు ఘంటసాల పాటల పోటీలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 10 : పట్టణంలో ఆదివారం ఘంటసాల వేంకటేశ్వరరావు 50వ వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి ఘంటసాల పాటల పోటీల నిర్వహణకు ఏర్పాటు చేశారు. ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘంటసాల కళామందిర్‌లో ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, అనంతరం సాయంత్రం కళాకారులచే సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్టు సంఘాధ్యక్షుడు ఆడారి హరి జగన్నాథం తెలిపారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో నిర్వహించే పాటల పోటీల్లో పాల్గొనే వారంతా ఇ.సాంబశివరావు, 98684 03081, మత్తుర్తి రామారావు, 9866307171 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొంటారన్నారు. అంతా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దేవదాయ శాఖలో పదోన్నతులు, బదిలీలు

- ఉత్తరాంధ్రలో భారీ మార్పులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 10: దేవదాయ శాఖలో సుదీర్ఘకాలం తరువాత పదోన్నతులపై బదిలీలు జరిగాయి. సహాయ కమిషనర్లకు ఉప కమిషనర్లుగా, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్‌లకు సహాయ కమిషనర్లుగా పదోన్నతులు కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. విజయనగరం జిల్లా రామతీర్థాలు ఆలయం ఈవో బీహెచ్ఎస్ఎన్ కిషోర్ కుమార్‌కు డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా నియమించారు. అన్నవరం దేవస్థానంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న డీవీఎల్ రమేష్‌బాబుకు డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ అరసవిల్లి సూర్యనారాయణమూర్తి దేవస్థానానికి ఈఓగా నియమించారు. విశాఖలో ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎన్.సుజాతకు సాంకేతిక కారణాల వల్ల పదోన్నతి కల్పించలేదు. కోనసీమ జిల్లాలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న కేఎన్‌డీవీ ప్రసాద్‌కు డీసీగా పదోన్నతి కల్పిస్తూ విజయనగరంలోని మాన్సాస్ ట్రస్ట్ ఈఓగా నియమించారు. అక్కడ ఈఓగా పనిచేస్తున్న డీవీవీ ప్రసాద్‌కు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. అన్నవరం దేవస్థానంలో ఏఈఓగా పనిచేస్తున్న వై.శ్రీనివాసరావుకు సహాయ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ రామతీర్థాలు ఆలయ ఈఓగా నియమించారు. శ్రీకాకుళం జిల్లాలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బలివాడ ప్రసాద్ పట్నాయక్‌కు సహాయ కమిషనర్‌గా పదోన్నతి కల్పించి అదే జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా నియమించారు.

అక్కడ ఏసీగా పనిచేస్తున్న హరిసూర్యప్రకాష్‌కు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. విశాఖ నగరంలోని ఇసుకకొండ సత్యనారాయణ దేవస్థానం ఈఓ బి.నగేష్‌బాబుకు సహాయ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ తూర్పుగోదావరి జిల్లా మావుళ్ళమ్మవారి దేవస్థానం ఈఓగా నియమించారు. వన్‌టౌన్ పెద్ద శివాలయం ఈఓ నీలిమకు ఏసీగా పదోన్నతి కల్పించి విజయనగరంలోని పైడితల్లిమ్మ దేవస్థానం ఈఓగా నియమించినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల ఉత్తర్వులు నిలుపుదల చేశారు.

ఆవ అందాలను తిలకించిన నాగబాబు


ఆవలో బోటు షికారు చేస్తున్న నాగబాబు

అచ్యుతాపురం రూరల్, ఫిబ్రవరి 10 : కొండకర్ల ఆవను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని జనసేన రాష్ట్ర నాయకుడు కొణిదెల నాగేంద్రబాబు అన్నారు. శనివారం మండలంలోని కొండకర్ల ఆవలో బోటుపై ఆయన షికారు చేశారు. ఆవ అందాలను తిలకించారు. ఆవలో బోటు షికారు, విదేశీ పక్షుల రాకపోకలు, చేపల పెంపకం, చేపల వేటతో జీవనం సాగించే మత్స్యకారులు వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. పర్యాటకులను ఆకర్షించేదుకు పలు కట్టడాలను కట్టాలని సూచించారు. ఆయన వెంట జనసేన నాయకులు సుందరపు విజయ్ కుమార్, సుందరపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నేత సూర్యచంద్ర హౌస్ అరెస్టు


చెర్లోపాలెంలో గృహ నిర్బంధంలో ఉన్న సూర్యచంద్ర

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 10 : నాతవరం మండలంలో గల తాండవ రిజర్వాయర్ ప్రధాన గేట్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం జనసేన నాయకులు శాంతియుత దీక్షకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూర్యచంద్రను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. స్వగ్రామం చెర్లోపాలెంలో శనివారం తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో మాకవరపాలెం ఎస్ఐ రామకృష్ణారావు ఆధ్వర్యంలో పోలీసులు ఆయనను నిర్బంధించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ జలాశయం ప్రధాన గేట్లు పాడవ్వడం వల్ల నీరు వృథాగా పోతోందన్నారు. దీంతో పంటల సాగుకు ఆకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ఈ గేట్లకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు కోరినప్పటికీ ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు చెవిన వేసుకోలేదన్నారు. ఈ నేపథ్యంలోనే శాంతియుత దీక్షకు పిలుపునిచ్చినట్టు చెప్పారు. ఇటువంటి అక్రమ నిర్బంధాలు ప్రజా సమస్యలపై పోరాటాలను ఆపలేవన్నారు.

వితంతు పింఛన్ కోసం వేడుకుంటూనే ఉంది..!!

- 11 నెలలుగా నాయకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- ఫలితం లేకపోవడంతో మండల సమావేశం వేదిక వద్దకు వచ్చి కన్నీళ్లు


పింఛను ఇప్పించాలని వేడుకుంటున్న వృద్ధురాలు కన్నయ్యమ్మ

మాకవరపాలెం, ఫిబ్రవరి 10: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎక్కడ సమావేశం ఏర్పాటైనా అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు చెపుతూనే ఉంటారు. కానీ పలుచోట్ల ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. వితంతు పింఛన్ కోసం ఓ వృద్ధురాలు దాదాపు ఏడాదిగా అధికారులు, వైసీపీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేకపోయిందంటే పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు. దీనిపై సదరు మహిళ నేరుగా శనివారం మాకవరపాలెంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుండగానే ఎంపీపీ సత్యనారాయణతో పాటు అక్కడున్న అధికారులకు దరఖాస్తు అంది కన్నీళ్లు పెట్టుకోవడం పలువుర్ని కలచివేసింది. ఇందుకు సంబంధించిన వివరాలివి.

మండలంలోని రామన్నపాలెం పంచాయతీ శివారు చినరాచపల్లి గ్రామానికి చెందిన చిటికెల కన్నయ్యమ్మ అనే వృద్ధురాలి భర్త వెంకునాయుడు పదకొండు నెలలు క్రితం మృతిచెందాడు. ఇతడు టీడీపీ సానుభూతిపరుడు కావడం వల్లే పింఛన్ పథకం రావడం లేదని స్థానిక టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే నాటి నుంచి నేటి వరకు వింతంతు పింఛన్ మంజూరు చేయాలని గ్రామంలో ఉన్న అధికార వైసీపీకి చెందిన ఎంపీటీసీ, సర్పంచ్‌ల వద్దకు పలుమార్లు ఆమె వెళ్లింది. దీంతో పింఛను వస్తుందని వారు చెప్పినప్పటికీ ఇటీవల కొత్తగా మంజూరైన పింఛన్ల జాబితాలో తనపేరు లేదని వాపోయింది. దీనిపై గ్రామ సచివాలయం నుంచి ఎంపీడీవో, ఆర్‌డీవో, జిల్లా కలెక్టర్ వరకు వెళ్లి సమస్యను వివరించి వేడుకుంది. అయినప్పటికీ నేటి వరకు పింఛన్ మంజూరు కాలేదు. గత్యంతరం లేక ఆమె మండల సమావేశం జరుగుతుండగా లోపలికి వచ్చి పింఛన్ మంజూరు చేయాలని ఎంపీపీ వద్ద కన్నీరు పెట్టుకుంది. దీనిపై ఆయన ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మిని ప్రశ్నించగా, కొత్తగా ఈ మధ్యనే దరఖాస్తు చేశామని తెలిపారు.

బ్రాహ్మణ వ్యతిరేకి జగన్

- సాగనంపేందుకు అంతా సిద్ధం కావాలి
- ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆనందసూర్య


మాట్లాడుతున్న మాజీ చైర్మన్ ఆనందసూర్య

చోడవరం, ఫిబ్రవరి 10 : బ్రాహ్మణుల సంక్షేమాన్ని విస్మరించి, బ్రాహ్మణ వ్యతిరేకిగా మారిన ముఖ్యమంత్రి జగన్‌ను సాగనంపేందుకు అంతా సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనందసూర్య పిలుపునిచ్చారు. రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ముక్కవిల్లి విస్సు అధ్యక్షతన శనివారం ఇక్కడ జరిగిన బ్రాహ్మణుల సమావేశంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. 2014లో చంద్రబాబు పాలనలో బ్రాహ్మణులకు ప్రత్యేకంగా రూ.500 కోట్లలో కార్పొరేషన్ ఏర్పాటు చేసి, కశ్యప, గరుడ, విద్యాభారతి వంటి సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ప్రస్తుతం జగన్ ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి, బ్రాహ్మణుల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. బ్రాహ్మణ పక్షపాతిగా ఉన్న చంద్రబాబును తిరిగి అధికారంలోనికి తీసుకు వచ్చేలా బ్రాహ్మణులంతా పనిచేయాలని కోరారు. దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న అవార్డు ప్రకటించిన పీఎంకు సంఘం తరపున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బ్రాహ్మణ కార్పొరేషన్ ఉమ్మడి జిల్లా మాజీ కో-ఆర్డినేటర్ కొమ్మనమంచి నరసింహమూర్తి, రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అందుకూరి కిరణ్‌కుమార్, పురుషోత్తమరాజు మాట్లాడారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, గూనూరు మల్లునాయుడు, సంఘం నాయకులు వింజమూరి శంకర్, గుం టూరు సత్యనారాయణ, ఉపాధ్యాయుల శ్రీనివాసరావు, బ్రహ్మానాయుడు పాల్గొన్నారు.

లోకేశ్ శంఖారావ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన శంఖారావాన్ని విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో గతంలో యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావం కార్యక్రమం ఉంటుందన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో బాధితులుగా మారిన అన్నివర్గాలకు లోకేశ్ యువగళం పాదయాత్ర ద్వారా ప్రజలకు భరోసా ఇచ్చారని తెలిపారు. మాడుగుల, చోడవరం, నర్సీపట్నం నియోజకవర్గాల్లో యువనేత పర్యటించి జగన్‌రెడ్డి ప్రభుత్వ దౌర్జన్యాలపై ప్రజలకు, కార్యకర్తలకు తెలియజేయనున్నారని తెలిపారు. శంఖారావం కార్యక్రమం ద్వారా ఆయా ప్రాంతాల్లోని ప్రజా సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలకు వివరిస్తూ ప్రతీ ఇంటికీ చేరువవుతారన్నారు.

పీవీకి భారతరత్న తెలుగువారికి గర్వకారణం

- మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు


పీవీ నరసింహారావుతో అయ్యన్నపాత్రుడు (ఫైల్)

నర్సీపట్నం, ఫిబ్రవరి 10: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం దక్కడం తెలుగు వారికి గర్వకారణమని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ క్రీడల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు అనేక సందర్భాల్లో ఆయనను కలిసినట్టు చెప్పారు. ఆయనతో ఉన్న అనుబంధం మరువలేనిదన్నారు. భారతదేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆర్థిక రంగానికి దిశానిర్దేశం చేసి ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా అభివృద్ధి చేసిన ఘనుడుగా పేర్కొన్నారు. తొలిసారి మన రాష్ట్రానికి చెందిన పీవీ నరసింహారావుకు భారతరత్న రావడం అందరికీ ఆనందదాయకమన్నారు.

తాను చనిపోతూ మరొకరికి పునర్జన్మ..


గొంతిన రాము (ఫైల్)

లంకెలపాలెం, ఫిబ్రవరి 10: బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందిన ఓ మహిళ మరొకరికి పునర్జన్మనిచ్చింది. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి. లంకెలపాలెంనకు చెందిన గొంతిన రాము (40) వారం రోజుల క్రితం ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు షీలానగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. బ్రెయిన్ డెడ్ కావడంతో అప్పటి నుంచి చికిత్స పొందుతూ శనివారం ప్రాణాలు విడిచింది. ఈక్రమంలో జీవన్‌దాన్ ట్రస్ట్ ప్రతినిధులు అవయవదానం గురించి మృతురాలి భర్త శివకు వివరించారు. దీంతో ఆమె అవయవాలను దానం చేసేందుకు భర్త అంగీకరించారు. ఆమె చనిపోతూ మరొకరి పునర్జన్మ ఇవ్వడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. కాగా మృతిరాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త శివ కాంట్రాక్టర్ వద్ద వెల్డర్‌గా పనిచేస్తున్నారు.

☛ సంక్షిప్తంగా..

డిప్యూటీ సీఎం దృష్టికి బొర్రా సమస్యలు

» రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు



డిప్యూటీ సీఎం రాజన్నదొరతో మాట్లాడుతున్న డాక్టర్ శంకరరావు

అరకులోయ, ఫిబ్రవరి 10: బొర్రా పంచాయతీ పరిధిలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను శనివారం ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర దృష్టికి తీసుకువెళ్లినట్టు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా టూరిజం సంస్థ ప్రైవేటు వ్యక్తులకు జిప్‌లైనర్‌కు అనుమతి ఇవ్వడం, వన సంరక్షణ సమితులకు చెందిన స్థలాలను అడ్వంచర్ పార్కు అభివృద్ధి కోసం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేయడం తదితర అంశాలను డిప్యూటీ సీఎంకు వివరించినట్టు చెప్పారు. బొర్రా గుహలు, ఇతర టూరిజం యూనిట్లలో పనిచేసే కార్మికులందరికీ జీతభత్యాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరామన్నారు. బొర్రా పంచాయతీ నిబంధనలను అనుసరించి బొర్రా గుహలు ఆదాయంలో పంచాయతీ అభివృద్ధికి ఇవ్వాల్సిన 20 శాతం వాటాను ఇవ్వకపోవడంతో కోట్లాది రూపాయల బకాయిలు ఉన్నాయని సర్పంచ్ ఫిర్యాదు చేసిన విషయం కూడా తెలిపామన్నారు. వీటిపై ప్రభుత్వపరంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్టు ఆయన తెలిపారు.

గంజాయితో ఒకరి అరెస్టు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 10: మండలంలోని జైపూర్ జంక్షన్‌లో మూడు కిలోల గంజాయితో ఒకరు పట్టుబడ్డారని ఎస్ఐ సంతోష్‌కుమార్ శనివారం తెలిపారు. జైపూర్ జంక్షన్‌లో శుక్రవారం వాహనాల తనిఖీలు చేపడుతుండగా ఒడిశా రాష్ట్రం నుంచి అరకు వైపునకు వస్తున్న వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించారన్నారు. నిందితుడి బ్యాగును పరిశీలించగా మూడు కిలోల గంజాయి పట్టుబడిందని చెప్పారు. ఒడిశా రాష్ట్రం నుంచి కొనుగోలు చేసి స్వరాష్ట్రానికి గంజాయిని తరలించే క్రమంలో నిందితుడు పోలీసులకు పట్టుబడ్డాడన్నారు. నిందితుడు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన రహీం సాహిక్‌గా గుర్తించామన్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కారు దగ్ధం



దగ్ధమైన కారు

జి.మాడుగుల, ఫిబ్రవరి 10: మండలంలోని వంజరి ఘాట్ రోడ్డులో ఓ కారు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లాకు చెందిన కొంత మంది పర్యాటకులు శనివారం లంబసింగి పర్యాటక ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడి నుంచి అరకు వెళ్లే క్రమంలో మధ్యాహ్నం వంజరి ఘాట్ వద్ద ఐదుగురితో ప్రయాణించే కారు ఒక్కసారిగా మంటలు చెలరేగింది. అప్రమత్తమైన ప్రయాణికులు కారు నుంచి దిగిపోయి పరుగులు తీశారు. మంటలు ఒక్కసారిగా చెలరేగి కారు దగ్ధమైంది. పర్యాటకులు అదృష్టవశాత్తు కారు నుంచి పరుగులు తీయడంతో ప్రాణపాయం తప్పిందని స్థానికులు ఊపిరి తీసుకున్నారు.

ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ చంద్రశేఖరరావు



చింతపల్లి, ఫిబ్రవరి 10: స్థానిక ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎస్.చంద్రశేఖరరావు నియమితులయ్యారు. కొంత కాలంగా ఇన్‌చార్జిలతో కొనసాగుతున్న సూపరింటెండెంట్ పోస్టును కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు పాడేరు జిల్లా ఆస్పత్రిలో డెంటల్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖరరావును నియమిస్తూ డీసీహెచ్ఎస్ కృష్ణారావు ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు.

వారపు సంతలో వాహన తనిఖీలు

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 10: మండల కేంద్రంలోని శనివారం జరిగిన వారపు సంతలో ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతకు వచ్చివెళ్లిన వాహనాలను, ప్రయాణికుల లగేజీలను పరిశీలించారు. సంత పరిసర ప్రాంతాల్లో పోలీసు గస్తీ ఏర్పాటు చేశారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టారు.

పీవీటీజీల సంక్షేమానికి కేంద్రం కృషి

పాడేరు రూరల్, ఫిబ్రవరి 10: గిరిజన గ్రామాల్లో పీవీటీజీల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని బీజేపీ గిరిజన మోర్చ మేధావుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కురసా పార్వతమ్మ చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారానికి చేపడుతున్న పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా శనివారం చోడిపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బిర్సా ముండా జయంతి సందర్భంగా పీవీటీజీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.24 వేల కోట్లు విడుదల చేసిందన్నారు. పంచాయతీలకు 14, 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తే, వైసీపీ ప్రభుత్వం సర్పంచులకు తెలియకుండా దోచిందన్నారు. కార్యక్రమంలో గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కురసా ఉమామహేశ్వరరావు, నాయకులు ఎన్.శివకృష్ణ, ఎస్.బాలరాజు, కె.బొంజుబాబు, అరకురమణ పాల్గొన్నారు.

జగన్ అరాచక పాలన అంతానికి సమయం ఆసన్నం

» టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి... పార్టీలో చేరిన కార్యకర్తలకు కండువాలు వేస్తున్న ఆహ్వానిస్తున్న మణికుమారి

పాడేరు రూరల్, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో సీఎం జగన్ అరాచక పాలన అంతమొందించడానికి సమయం ఆసన్నమైందని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించిన నాదమే శంఖారావం అని చెప్పారు. యువగళం పాదయాత్రలో లోకేశ్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావంతో పర్యటించి జగన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన దౌర్జన్యాలను ప్రజలకు వివరించనున్నట్టు చెప్పారు. నిరుద్యోగంతో యువత, ధరలు పెరుగుదలతో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు భరోసా కల్పించేందుకే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శంఖారావం కార్యక్రమానికి లోకేశ్ శ్రీకారం చుట్టారన్నారు. రానున్న 50 రోజుల్లో 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో లోకేశ్ పర్యటించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు సమస్యలను ఇంటరాక్టివ్ సెషన్స్ ద్వారా నోట్ చేస్తా చేస్తారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తారన్నారు. జగన్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, అరాచక పాలనపై ప్రజలకు వివరిస్తారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బాధితులుగా మారిన అన్ని వర్గాల ప్రజలకు ఇప్పటికే పాదయాత్ర ద్వారా భరోసా ఇచ్చారన్నారు. శంఖారావం కార్యక్రమం ద్వారా కార్యకర్తలు నేరుగా లోకేశ్‌తో వారి అభిప్రాయాలను పంచుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గబ్బాడ సింహాచలం, కోడా వెంకట సురేష్‌కుమార్, గంగపూజారి శివకుమార్, డప్పోడి వెంకటరమణ, మహ్మద్ తాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగనాసుర పాలనను సాగనంపుదాం: మణికుమారి

జి.మాడుగుల, ఫిబ్రవరి 10: జగనాసుర పాలనకు సాగనంపుదామని మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి పిలుపునిచ్చారు. వంజరి పంచాయతీ పరిధిలోని కృష్ణపూరం, గెమ్మెలి గ్రామాల్లో శనివారం బాబు షూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ నిరంకుశ పాలనపై ప్రజలు విసిగిపోయారని, సీఎం జగన్‌ను గద్దె దించడానికి సిద్ధమయ్యారని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. టీడీపీ పొందుపరిచిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, వచ్చే ఎన్నికల్లో టీడీపీకి మద్దతు తెలపాలని ఆమె కోరారు. అనంతరం పార్టీలో చేరిన పలువురు కార్యకర్తలకు కండువాలు వేసి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ వి.కాంతమ్మ, నాయకులు కొట్టగుళ్లి సుబ్బారావు, బొర్రా విజయరాణి, వర్తన పిన్నయ్యదొర, మత్స్యరాజు, నాగబ్బాయి, గంతన్నదొర, రాజబాబు, అప్పలనాయుడు, బాబూరావు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో చక్కని భవిష్యత్తు

» టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర



కుజభంగిలో గిరిజనులతో కలిసి మినీ మేనిఫెస్టో కరపత్రాలు ప్రదర్శిస్తున్న దొన్నుదొర

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 10: టీడీపీ పొందుపరిచిన సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్ర ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందని పార్టీ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. రంగిలిసింగి, గుంటసీమ, గుంటగన్నెల, లైగండ పంచాయతీల పరిధిలోని గిరిజన గ్రామాల్లో పార్టీ నాయకులతో శనివారం విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. లక్క, కుసభంగి, కింజేరు, జోగిపుట్టు, లైగండ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి టీడీపీ అమలు చేయనున్న పథకాలను వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభలో దొన్నుదొర మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు ఆరు గ్యారంటీ పథకాలకు రూపకల్పన చేశారన్నారు. టీడీపీ అధికారంలో వస్తే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల ఉచితంగా అందజేస్తారన్నారు. అలాగే ఆడబిడ్డ నిధితో 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ రూ.1500, తల్లికి వందనం పథకంతో ఇంటిలో చదువుకున్న పిల్లందరికీ ఏడాదికి రూ.15 వేలు బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్టు చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మొదలుకుని రైతన్నలకు ఏడాదికి రూ.20 వేలు, 20 లక్షల మంది నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి కల్పించేందుకు టీడీపీ సిద్ధంగా ఉందన్నారు. జీవో నంబరు-3ను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని, గిరిజన నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల మెండుకు జీవో నంబరు-3 పునరుద్ధరణకు టీడీపీ సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని అధికారంలో తీసుకురావాలని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసి గిరిజన ప్రాంతంలో పునాదులు వేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం కింజేరు గ్రామంలో సీపీఎం వార్డు సభ్యుడితో పాటు పలువురు గిరిజనులు టీడీపీ తీర్థాన్ని పుచ్చుకోగా, వారికి దొన్నుదొర కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు, అరకు పార్లమెంట్ నియోజకవర్గ కోశాధికారి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ దన్నెరావు, టీఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, టీడీపీ, జనసేన నాయకులు సీతారాం, విశ్వనాథం, దన్నేశ్వరరావు, ఆనందరావు, సుబ్బారావు, భాస్కరరావు, కొములునాయుడు, నాయకులు రఘునాథ్, సింహాద్రి, బాబూరావు, నాగరాజు, ప్రసాద్, అర్జున్, దొయితరి, గెన్ను తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో యువతకు విజ్ఞానం

» గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రాజీవ్ గాంధీ

కొయ్యూరు, ఫిబ్రవరి 10: గిరిజన యువతను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దేందుకు ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాలలో గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నట్టు గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రాజీవ్ గాంధీ తెలిపారు. మండల కేంద్రంలో సుమారు రూ.22 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని శనివారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలలో దినపత్రికలతో పాటు పోటీ పరీక్షలకు అవసరమయ్యే స్టడీ మెటీరియల్, ఉద్యోగ, ఉపాధి అవకాశాల సమాచారానికి పత్రికలు, వృద్ధులకు రామాయణం, మహాభారతం వంటి గ్రంథాలు, చిన్న పిల్లలకు అవసరమయ్యే కథల పుస్తకాలు తదితర సమగ్ర రచనలతో సమాచారం ఉంటుందని చెప్పారు. వీటిని అందరూ సద్వినియోగపరుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా సీఎం సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరావు, లైబ్రేరియన్ కన్నబాబు, ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, వైస్ ఎంపీపీలు వెంకటరమణ, నూకాలమ్మ, ట్రైకార్ డైరెక్టర్ సరస్వతి, కన్వీనర్ సుధాకర్, చింతపల్లి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాక్సైట్ మైనింగ్ కోసమే రహదారుల నిర్మాణం

...3వ పేజీ తరువాయి

పోహకాహారం అందించామన్నారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి మాట్లాడుతూ గిరిజన ప్రాంతం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అన్నారు. కాంగ్రెస్ పార్టీని, రాజశేఖర్‌రెడ్డిని ఆదివాసీలు గుండెల్లో పెట్టుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని తొలి కాంగ్రెస్ ఎమ్మెల్యేని పాడేరు నియోజక వర్గం నుంచే అసెంబ్లీకి పంపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఒడిశా మాజీ మంత్రి జయరామ్ పాంగి, డీసీసీ అధ్యక్షుడు వంతల సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి వీరన్న పడాల్, అరకులోయ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పాచిపెంట శాంత కుమారి, పీసీసీ డెలిగేట్ దంగేటి సత్తిబాబు, పార్టీ సీనియర్ నాయకులు సాగిన కృష్ణపడాల్, పాచిపెంట చిన్నస్వామి, తెలగంజి సోమేశ్వరరావు, స్వాముల సుబ్రహ్మణ్యం, సాగిన కృష్ణపడాల్, మొట్టడం బాలరాజు, గురుమూర్తి, బి.రాంబాబు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుపై షర్మిలకు ఉపాధ్యాయుల వినతి



షర్మిలకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు

చింతపల్లి, ఫిబ్రవరి 10: సీపీఎస్ రద్దుపై పీఆర్‌టీయూ, ఏపీసీపీఎస్ఈఏ నాయకులు పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు వినతిపత్రం అందజేశారు. శనివారం ఇక్కడికి వచ్చిన షర్మిలను కలిసి ఎన్నికల ముందు వారం రోజుల్లో రద్దు చేస్తామని జగన్ హామీ ఇచ్చారని, నేటికి అమలు చేయడం లేదని ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దుకు తన వంతు సహకారం అందించాలని షర్మిలను కోరడంతో, ఆమె సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీగిరి, ఏపీసీపీఎస్ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.

వైసీపీ డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్‌గా అమర్

» టికెట్‌పై స్పష్టత కరవు

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను పార్టీ అధిష్ఠానం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా రీజనల్ డిప్యూటీ కో-ఆర్డినేటర్‌గా నియమించింది. ఈ మేరకు శనివారం ఆదేశాలు జారీచేసింది. ప్రస్తుతం రీజనల్ కో-ఆర్డినేటర్‌గా వైవీ సుబ్బారెడ్డి ఉన్నారు. ఆయనకు సహాయకుడిగా అమర్‌నాథ్‌ను నియమించారు. అమర్‌నాథ్ ప్రస్తుతం అనకాపల్లి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అక్కడ ఆయన్ను తప్పించి మలసాల భరత్‌కుమార్‌ను సమన్వయకర్తగా పార్టీ నియమించింది. వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేయాలో మంత్రికి ఇంతవరకూ స్పష్టత ఇవ్వలేదు. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్ స్థానంలో అవకాశం ఇస్తారని అనుకున్నా.. ఆ సూచనలు ఏమీ కనిపించడం లేదు. అనకాపల్లి ఎంపీగా పోటీకి దింపినా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదని ఆయన అనుచరులు అంటున్నారు. జగన్ ఏమి చెబితే అది చేస్తానని అమర్‌నాథ్ అంటున్నారు. ఎన్నికల బరిలో ఉంటారా?, లేక పార్టీ సేవలకే పరిమితమవుతారా?...అనేది త్వరలో తేలిపోనుంది.

హనుమాన్ విజయంలో మనోళ్లు

» అల్లూరి, అనకాపల్లి జిల్లాల అందాలను కెమెరాలో బంధించిన మూర్తి చోడవరం వాసి



హనుమాన్ సినిమాలో ఉదయ్‌కృష్ణ రూపొందించిన విజువల్ వండర్స్

చోడవరం, ఫిబ్రవరి 10: ఈ ఏడాది సంక్రాంతి పండుగకు విడుదలైన హనుమాన్ సినిమా కలెక్షన్ల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. చిన్న సినిమాగా విడుదలై పాన్ ఇండియా స్థాయిలో ప్రభంజనం సృష్టించి ఎన్నో రికార్డులను సొంతం చేసుకుంది. ఎందరో ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. ఈ విజయంలో వీఎఫ్ఎక్స్ కీలక భూమిక పోషించింది. దీనికి ప్రధాన పాత్ర పోషించిన వీఎఫ్ఎక్స్ సృష్టికర్త పండమనేటి ఉదయ్‌కృష్ణకు చోడవ రంతో విడదీయరాని అనుబంధం ఉంది. సినిమాకు పనిచేసిన స్థానిక ఫొటోగ్రాఫర్ మూర్తి కూడా స్థానికుడు కావడం విశేషం.

హనుమాన్ సినిమా వీఎఫ్ఎక్స్ సృష్టికర్త ఉదయ్‌కృష్ణ బాల్యమంతా చోడవరం, ఉమ్మడి విశాఖ జిల్లాలోనే సాగింది. ఆయన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా అయినప్పటికీ తండ్రి చోడవరం సబ్ ట్రెజరీ ఉద్యోగి కావడంతో చోడవరం, విశాఖలోనే విద్యాభ్యాసం కొనసాగింది. విశాఖలో కంప్యూటర్ గ్రాఫిక్స్ కోర్సు నేర్చుకోవడం ద్వారా వీఎఫ్ఎక్స్‌లో ప్రావీణ్యం సంపాదించారు. సత్యం కంప్యూటర్స్‌లో ఉద్యోగం చేస్తూ, హైదారాబాద్‌లో వివిధ రంగాలకు సంబంధించిన యాడ్స్ రూపొందించే వారు. హిందీ, డిస్నీ హాట్‌స్టార్‌లో వచ్చే యానిమేషన్ సీరియళ్లు, పలు తెలుగు, హిందీ సినిమాలకు సైతం వీఎఫ్ఎక్స్ పనులు చేసేవారు. హనుమాన్‌లో తక్కువ బడ్జెట్‌లోనే ఉదయ్‌కృష్ణ రూపొందించిన వీ ఎఫ్ఎక్స్ వర్క్ జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చింది. ఈ సినిమాలో చూపించిన పర్వతాలు చాలా వరకు పాడేరు మండలంలోని వంట్లమామిడి, వంజపర్తి తదితర ప్రాంతాల్లో తీసినవి. ఇక ఈ సినిమా క్లైమాక్స్‌లో కొన్ని సీన్లు చీడికాడ మండలం కోనాంలో చిత్రీకరించారు. ఈ సినిమాలో బ్యాక్‌గ్రౌండ్‌గా ఉపయోగించిన కొండలన్నీ పాడేరు మండలంలోని వంజపర్తి, మోదాపల్లి, దల్లాపల్లి ప్రాంతాల్లోనివి కావడం విశేషం. ఈ కొండల ఫొటోలను పట్టణంలోని ఎడ్లవీధికి చెందిన ఫొటోగ్రాఫర్ సత్యనారాయణమూర్తి తీశారు.

చోడవరంతో విడదీయరాని బంధం

-పి.ఉదయ్‌కృష్ణ, వీఎఫ్ఎక్స్ సృష్టికర్త



ఇప్పటి వరకు హిందీ, తెలుగు సినిమాలకు వీఎఫ్ఎక్స్ పని చేసినా హనుమాన్ సినిమా ద్వారా వచ్చిన గుర్తింపు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. చిన్నతనం నుంచి చోడవరంలోనే పెరిగాను. నా స్నేహితులంతా ఇక్కడి వారే. చోడవరంతో నా అనుబంధం మరిచిపోలేనిది. తక్కువ ఖర్చులో హనుమాన్ సినిమాకు వీ ఎఫ్ఎక్స్ వర్క్ చేశాను. సినిమా టీజర్‌తోనే హనుమాన్ సినిమా ఇండస్ట్రీలో సెన్సేషన్ క్రియేట్ చేసింది. హనుమాన్ సినిమాకు విజువల్ ఎఫెక్ట్స్ అందించడం నా పూర్వ జన్మసుకృతంగా భావిస్తున్నాను.

కాశీపురంలో దారుణం

మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించిన వివాహిత

» తన భర్తతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో ఘాతుకం

» కాలిన గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు

» పోలీసుల అదుపులో నిందితురాలు



కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అల్లంగి లక్ష్మి

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 10: తన భర్తతో వివాహేతర సంబంధం కలిగి ఉందన్న అను మానంతో భార్య. ఓ మహిళపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. ప్రస్తుతం ఆమె కాలిన గాయాలతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. అనకాపల్లి జిల్లా మాడుగుల మండలంలో సంచలనం సృష్టించిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ దామోదరనాయుడు తెలిపిన వివరాలివి. తాటిపర్తి పంచాయతీ కాశీపురం గ్రామంలో అల్లంగి లక్ష్మి అనే మహిళ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఈమె భర్త చిలుకునాయుడు ఏడాది కిందట చనిపోయాడు. ఈమెకు ఇద్దరు సంతానం. ఈమెకు అల్లంగి పోతురాజు, అతని భార్య చిన్నమ్మలు అలియాస్ చిన్నారి సమీప బంధువులు. వీరంతా ఇదే గ్రామంలో నివాసం ఉంటున్నారు. అయితే పోతురాజుకు అల్లంగి లక్ష్మికి మధ్య వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో చిన్నమ్మలు కోపోద్రిక్తురాలై శుక్రవారం రాత్రి పది గంటల సమయంలో లక్ష్మి ఇంటికి వెళ్లింది. ఆమె ముఖంపై, శరీరంపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. దీంతో ఆమె ముఖం, కడుపు శరీర భాగాలపై గాయాలయ్యాయి. మంటలు అంటుకోవడంతో లక్ష్మి పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి ఆర్పారు. వెంటనే ఆటోలో మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ప్రస్తుతం లక్ష్మి చికిత్స పొందుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, చిన్నమ్మలును అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు సహాయ సహకారాలు: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

కొయ్యూరు, ఫిబ్రవరి 10: అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి భరోసా ఇచ్చారు. కంఠారంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను శనివారం ఎమ్మెల్యే పరామర్శించి, వారికి నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకునేందుకు చర్యలు ముమ్మరం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, వైస్ ఎంపీపీలు వెంకటరమణ, నూకాలమ్మ, నాయకులు సరస్వతి, రాజులమ్మ, నాగమణి, గాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి స్థానం లేదు: పాంగి రాజారావు

పాడేరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి స్థానం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మన్యం పర్యటన సందర్భంగా ఆయన స్పందించారు. దేశంలో బీజేపీని ఎదుర్కొనే స్థాయి కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. ప్రత్యేక హోదా గురించి మాట్లాడే అర్హత షర్మిలకు లేదన్నారు. పల్లెల్లో సైతం బీజేపీ అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తున్నదన్నారు. అలాగే రాష్ట్రంలో తన జగన్ సినిమా ఫ్లాప్ అయిందని, షర్మిల సినిమా చిత్రీకరణ సమయంలో ఫెయిల్ అవుతుందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో జగన్, షర్మిల సైతం ఇంటికి వెళ్లతారని ప్రజలు అనుకుంటున్నారని, రాష్ట్రంలో బీజేపీ ఆట మొదలైందని రాజారావు పేర్కొన్నారు.

'వైఎస్ షర్మిల పర్యటనతో ఒరిగేది లేదు'

జి.మాడుగుల, ఫిబ్రవరి 10: రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చింతపల్లి పర్యటనతో ఒరిగేదేమీ ఉండదని వైసీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జివిశ్వేశ్వరరాజు విమర్శించారు. పార్టీ కార్యాలయంలో శనివారం కార్యకర్తలతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రైకార్ మాజీ చైర్మన్ శతక బుల్లిబాబుకు సీఎం జగన్ సముచిత స్థానం కల్పించారని, విలువలు లేని నేతలు ఉన్నాలేకపోయినా నష్టం లేదన్నారు. సమావేశంలో నాయకులు కె.సత్యనారాయణ, మత్స్యకొండంనాయుడు, కె.రాంబాబు, జి.సన్యాసిదొర, చిట్టిబాబు, రాంబాబు, మన్మధరావు, పండన్న, రామారావు, చిన్నారావు, లక్ష్మణపడాల్, ప్రకాశ్ పాల్గొన్నారు.

తాగునీటి పథకం నిర్మాణానికి శంకుస్థాపన

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 10: మండలంలో జర్రెల పంచాయతీ కాంగువీధి, సున్నపుకోట గ్రామాలలో జల జీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేస్తున్న తాగునీటి పథకాల నిర్మాణ పనులకు సర్పంచ్ బి.భాగ్యవతి శనివారం శంకుస్థాపన చేశారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా కాంట్రాక్టర్లకు ఆమె సూచించారు. రూ.15 లక్షలు వెచ్చించి తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే సోలార్ సహాయంతో వాటర్ ట్యాంకు నుంచి పైప్‌లైన్ ద్వారా ఇంటింటికీ కొళాయిలను అమర్చడం జరుగుతుందని చెప్పారు.

అసాంఘిక కార్యకలపాలతో ముప్పు



గిరిజన యువతతో మాట్లాడుతున్న సీఐ రమేశ్

జి.మాడుగుల, ఫిబ్రవరి 10: గంజాయి, నాటుసారా వంటి అసాంఘిక కార్యకలపాలతో భవిష్యత్తుకు ముప్పు అని సీఐ రమేశ్ సూచించారు. మండల కేంద్రంలోని కొత్తపల్లి, సాడేకు గ్రామాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన యువకులతో మాట్లాడుతూ వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైనా తమకు సంప్రదించాలని సూచించారు. అలాగే ఎన్నికలు సమీపిస్తుండడంతో గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని సీఐ హెచ్చరించారు.

వంజంగిలో రహదారి సౌకర్యం కల్పించాలని నిరసన

పాడేరు రూరల్, ఫిబ్రవరి 10: మండలంలో వంజంగి పంచాయతీ పరిధిలోని పోతురాజుమెట్ట, కొత్తవలస, వై.సం పాలు గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు నిరసన కార్యక్రమం చేపట్టారు. బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కురసా ఉమామహేశ్వరరావు, గిరిజన మోర్చ మేధావుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కురసా పార్వతమ్మ ఆధ్వర్యంల ఈ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ చేపట్టిన పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలకు రహదారి సౌకర్యం లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, గ్రామ ప్రజలతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఈ సందర్భంగా వారు చెప్పారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు అత్యవసర వైద్య సేవలు అందుకొనేందుకు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారుల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



రహదారి నిర్మించాలని నినాదాలు చేస్తున్న గిరిజనులు